స్వతంత్రత అనుభవిచే వారే తమకు అనుగుణమైన పరిస్థితులను సృజించుకోగలరు. మానవుల కోరికలు ఫలించనప్పుడే గదా అసంతృప్తి కలుగుతుంది. కోరికలు ఫలించకపోవడానికి ముఖ్యకారణం పరిస్థితుల అననుకూల్యం. తనకు సరిపడే పరిస్థితులను సృజించుకోగలవాడు తన కోరికలను అన్నిటినీ సాధించలేకపోయినా, అందువల్ల కలిగే అసంతృప్తి ఆశాభంగాలు మాత్రం అంత తీవ్రంగా ఉండవు. ఒక రకం పరిస్థితులు లభించినప్పుడు మరియొక విధమైన వాటిని కల్పించుకోగలడు వానికి స్వాతంత్ర్యం ఉన్నప్పుడు. ఇందువలన లభించే సుఖమునకు కొలత నిర్ణయించలేం; ఇటు ఆనందం మరొక తీరున చేకూరదు. తాను స్వతంత్రించి చేసుకొన్నది సుఖమును ఇచ్చునట్లు, అన్యథా వచ్చిన దానివల్ల ఉండదు.

స్వాతంత్ర్యం వలన కలిగే ఈ లాభాలు వ్యక్తికే కాదు, సంఘమునకూ దేశానికీకూడా, ప్రపంచానికిన్నీ అని చెప్పవచ్చును. వ్యక్తికంటే దేశానికే ఎక్కువ లాభము; దాని విజృంభము వలననే దేశముయొక్క పటుత్వం వృద్ధిచెందును. దేశమందు నిజమైన జీవనధర్మం ప్రజలను ప్రోత్సహించవలెనంటే, దేశగతమైయున్న స్వాతంత్ర్యమే సాధనము. దేశమందు ఉండవలసిన శాంతికి బీజకారణము ఈ స్వాతంత్ర్యమే. స్వాతంత్ర్యమును భంగపరచినప్పుడే శాంతి చెడును. ఈ అభిప్రాయముతోనే ఒక పండితవరుడు చెప్పాడు: "రాష్ట్రం యొక్క ఔన్నత్యము కొలవడానికి మానముగా దేశమందు ప్రసరించిఉన్న స్వాతంత్ర్యాన్ని నిరూపించవలెను" అని: దేశంలోను, ప్రపంచంలోను శాంతి నెలకొల్పెదమని భీష్మిస్తూ స్వాతంత్ర్యాన్ని రూపుమాపుచేసే విధానాలను నిర్మించి, నిరంకుశ పరిపాలన నడిపించే హిట్లరు, ముసోలినీ మొదలైన వారివంటి వారు అందరూ ఈ కొలతమానాన్ని స్మరింతురు గాక. చచ్చిపోయిన హిట్లరు, ముసోలినీ జాతిసూచక వాచకములు. ఇప్పుడు పరిపాలన నడిపిస్తున్న అధికారులు చాలమంది అనేక పర్యాయములు ప్రజా పరిపాలన అని అంటూ నిరంకుశాధికార చట్టాలను, ప్రయోగాలను సమర్థిస్తున్నారు. కాబట్టి స్వాతంత్ర్యం ఎందుకు అని తర్కించడానికి కాలము మారిపోలేదు పూర్తిగా. ఇది ఎప్పటికీ అవసరముగా ఉంటుంది కాబోలు!

స్కెచ్

# రక్త పరీక్ష

యన్. జానకి

"ఏమన్నా దొరికిందా?" అన్నది సుశీల.

తలవంచుకున్నాడు శాస్త్రి. "లేదు." ఈ రెండు అక్షరాలు ప్రతిదినం సుశీల అతని నోటి వెంట వింటూనే వున్నది. "సర్టిఫికేటు తాకట్టు పెట్టానన్నా యివ్వలేదా?"

"వెధవ కాగితం ముక్క, నేనేం చేసుకుంటానన్నాడు. ఔను. నా బి. ఏ. డిగ్రీ నాకెంత పెట్టిందో వాడికీ అంతే పెట్టుంది." శాస్త్రి మంచంమీద మేను వాల్చి యింటి కప్పుకేసి చూస్తున్నాడు. సుశీల తల ప్రక్కకు తిప్పుకొని రెండు కన్నీటి బొట్లు రాల్చింది. మూసిన కన్ను తెరవకుండా పడివున్నాడు శాస్త్రి కొడుకు బాబు. ఆమె మాతృ హృదయం క్షోభిస్తున్నది. శాస్త్రిమాత్రం ఏం చేస్తాడు? డిగ్రీ పుచ్చుకుని ఏడాదైనా యింతవరకు వుద్యోగం ఏదీలేదు. కన్న కొడుకు ప్రాణాన్ని కాపాడుకోడానికైనా ఎర్రని ఏగాణీ లేదు.

"పోనీ, డాక్టరునైనా అడగకపోయినారూ?" అన్నది సుశీల. శాస్త్రి తల ఎత్తి చూశాడు. సుశీల కన్నీటిని బలవంతాన ఆపుకుంటోంది. "ఔను" అంటూ శాస్త్రి లేచాడు మంచంమీదనుంచి. మిట్టమధ్యాహ్నం ఎండ మాడ్చేస్తున్నది. తారురోడ్డుమీద చెప్పులు లేకుండా నడుస్తున్నందువలన శాస్త్రి కాళ్లు

వొళ్ళు లెక్కపోయాయి. తల మాడుతున్నది. కాని, శాస్త్రి హృదయంలో ఆవరించివున్న బాధాగ్నిముందు యిది ఏపాటిది? చకచకనడుస్తున్నాడు. డాక్టరు యింటిముందు ఆగాడు. "డాక్టరుగారూ!" తలుపు తెరవబడింది. "లేరు" జవాబువచ్చింది.ఒక్కక్షణం నిశ్చేష్టుడై చూచాడు. నిరాశతో వెనుక్కుతిరిగాడు. ఇంతలోనే డాక్టరుగారి కారు వచ్చింది. "డాక్టరుగారూ! నా కొడుకుని రక్షించాలి. త్వరగా రారూ?" అని శాస్త్రి బతిమాలుకున్నాడు. డాక్టరు నిర్లక్ష్యంగా సిగరెట్టు ముట్టించుకుంటూ, "ఫీజు తెచ్చావా?" అన్నాడు. శాస్త్రి ఏమని చెప్తాడు? "కనికరించాలి. బీదవాణ్ణి. నెమ్మదిమీదయిచ్చుకుంటాను" అన్నాడు. డాక్టరు కారుఎక్కాడు. "ఏమండీ, రారూ?" అన్నాడు దీనంగా శాస్త్రి. "ఎల్లా వస్తానయ్యా?" డాక్టరు కారు స్టార్టు చేశాడు. శాస్త్రి విషపు నవ్వుతో, "ఔను. ఎందుకు వస్తావు? నీలో మానవత్వం లేనిదే ఎల్లావస్తావు? నీతోటి మానవుని ప్రాణాన్ని డబ్బుతో విలువ కట్టున్నావు" అంటూ వచ్చిన దారినే బయలుదేరాడు.

ఇంటికొక ఫర్లాంగు దూరాన వున్నాడు. ఛీ! తనేం చేస్తున్నాడు? కొడుకు ప్రాణాన్ని కాపాడడానికి అసమర్థత చూపిస్తున్నాడు. డబ్బు! డబ్బుకావాలి. ఈ పాపపులోకంలో దానికున్న విలువ మరిదేనికీలేదు. మానవులంతా దాని చెప్పు చేతల్లో కీలుబొమ్మల్లా ఆడుతున్నారు. ఎక్కడికి పోతున్నాడో తెలియకుండానే సాగిపోతున్నాడు శాస్త్రి. అప్రయత్నంగా తల ఎత్తిచూచాడు. బ్లడ్ బాంక్ అన్న ఎర్రటి పెద్ద అక్షరాలు అతనిదృష్టి నాకర్షించాయి. తన రక్తమిచ్చి తన కొడుకు ప్రాణం రక్షించాలి. తప్పదు. లోపలికి వెళ్ళాడు. ఔన్సుకు పదిరూపాయలు. ఒక్క నాలుగౌన్సులు నలభైరూపాయలు.

డాక్టరు పరీక్షచేశాడు. "మంచి రక్తమే గాని, నాలుగౌన్సులు తీస్తే నీవు బ్రతకడం కష్టం. ఆలోచించుకో." తాను బ్రతకడం పోతే ఎవరికి బాధ. ఉండి సుశీలకి, బాబుకి వొరిగిస్తున్నదేమిటీ? పోతే డాక్టరు వస్తాడు. బాబు బ్రతుకుతాడు. "ఫర్వాలేదు. డాక్టరుగారూ! తీసుకోండి" అన్నాడు శాస్త్రి. అనేక విధాల చెప్పిచూచారు అక్కడి వాళ్ళంతా కాని, శాస్త్రి దృఢనిశ్చయాన్ని మార్చలేక పోయినారు. డాక్టరు రక్తం తీస్తున్నాడు. ఒక ఔన్సు! శాస్త్రి బాధతో కళ్లు మూసుకున్నాడు. రెండు ఔన్సులు. బాధ! అతి కష్టంమీద నోరువిప్పి, తన ఎడ్రసు చెప్పాడు. అంతే స్పృహలేదాతనికి. నాలుగౌన్సులు, శాస్త్రి కళ్లు మూసాడు. ఇక తెరవలేదు.

అతని యిల్లు వెతుకుతూ వెళ్ళింది హాస్పిటలు నర్సు. ఆ యిల్లంతా ప్రశాంతంగావున్నది. సుశీల స్పృహలేకుండా పడివున్నది. బాబు పడుకున్నాడు. నర్సు వెళ్ళి బాబుని చూచింది. ఈ లోకంలోని కష్టాలని అంత పసితనంలోనే అనుభవించాను సుమా! అన్నట్లుగా అతని పెదవులు నవ్వుతున్నాయి. కాని, యిక వాడిలో చైతన్యం లేదు. ఇక బాబు కష్టాల ననుభవించనక్కరలేదు. కష్టాలు తెలియని శాశ్వతానందలోకాన్ని చేరాడు.

మెల్లిగా సుశీలను లేపింది నర్సు. ఆమె కొద్ది సేపటికి కళ్లు తెరిచింది. "నేను నర్సును తల్లీ. శాస్త్రిగారు యీ డబ్బు పంపారు." ఆవిడ డబ్బివ్వపోయింది. "ఎందుకు? డబ్బు ఎందుకు? ఎవరికోసం? నా బాబు, నా చిట్టితండ్రికి మందు లెందుకింక? వాడు స్వర్గంలోని అమృతమే త్రాగుతాడు" అంటూ ప్రొల్లున ఏడవసాగింది సుశీల. "ఏడవకమ్మా" అని నర్సు ఓదార్చింది. కాని, హృదయంలోని ఆ వ్యధను ఓదార్పు లేంచేస్తాయి? మాటలతో మనసు బాధల్ని మరవకలిగితే, మానవులలో మానవత్వమేది? "ఏదీ, వారేరి?" అన్నది సుశీల ఏడుస్తూనే. నర్సు తలవంచింది "వారిక లేరు."

"ఆ!" కెవ్వున అరచింది సుశీల. అంతే. ఆమెకి స్పృహలేదు. ఆమెకంతా శూన్యం. ఆ ప్రశాంతంలోఒకహృదయం గాలిలో దీపంలాగ వేటికి అల్లల్లాడుతున్నది. ఆమెకు శాస్త్రి, బాబు, లేరు. హృదయంలోనుండి మాత్రం తొలగిపోలేదు. కాని, ఆమె హృదయం శూన్యం.